PRAJA JYOTHI 01-10-2026_1 9/30/2026 11:29 PM Page 1


# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## కరీంనగర్

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

గురువారం 01 అక్టోబర్ 2026




## బహిరంగ ప్రదేశాల్లో మందు తాగితే ఖేల్ ఖతం!

- అనుమతి లేని డ్రోన్లు, డీజే ధ్వనులపై కఠిన చర్యలు
- పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



వివరాలు 4లో..

# వస్త్ర పరిశ్రమకు చిరునామా సిరిసిల్ల

- గత బీఆర్ఎస్‌పాలనలో సిరిసిల్ల ఉరిసిల్లగా మారింది
- చేనేత కార్మికుల ఆత్మహత్యలు, గల్ఫ్ వలసలను గత పాలకులు అడ్డుకోలేదు
- నేత కార్మికుల కోసం ప్రజా ప్రభుత్వం రూ.1,741 కోట్లు ఖర్చు చేసాం
- రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1,700 కోట్ల నిధులు మంజూరు





ధైర్యం, దైవం కలిసి వెలిసిన ప్రాంతం సిరిసిల్ల అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో దైవచింతనతో పాటు, నిజాం రజాకార్లపై పూర్వీకులు చేసిన పోరాటానికి సిరిసిల్ల ప్రజలు వారసులని పేర్కొన్నారు. సిరిసిల్ల అంటే సిరులకు నిలయమని, అయితే గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల 'ఉరిసిల్ల'గా మారిందని విమర్శించారు. బుధవారం సిరిసిల్లలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చిరునామాగా ఉందని, వేలాది కుటుంబాలు చేనేత, వస్త్ర పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన చీరలను తయారు చేసే నైపుణ్యం ఇక్కడి కార్మికుల సొంతమని చెప్పారు.

వివరాలు 10 లో..



# పేదల కన్నీరు తుడిచేలా కలెక్టరేట్ పనిచేయాలి

- ప్రజల సమస్యలను కుటుంబ సమస్యలుగా భావించి పరిష్కరించాలి
- ఉద్యోగుల పనితీరుపైనే ప్రభుత్వానికి మంచి పేరు.. చెడ్డ పేరు
- కరీంనగర్ అభివృద్ధిపై మరోసారి పూర్తిస్థాయి సమీక్షకు వస్తా
- గౌరవెల్లి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల కోసం కేంద్రంతో సంప్రదింపులు
- సీఎం రేవంత్‌రెడ్డి



2

## బ్యాంకింగ్ లావాదేవీల్లో అప్రమత్తత అవసరం

- ఆశ, భయాన్ని ఆసరాగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు



5లో

సుగ్లాంపల్లి 132 కేవీ సబ్‌స్టేషన్ ఎదుట

## బీజేపీ ధర్నా

- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ ఈటల రాజేందర్ మండిపాటు





# పేదల కన్నీరు తుడిచేలా కలెక్టరేట్ పనిచేయాలి

- ప్రజల సమస్యలను కుటుంబ సమస్యలుగా భావించి పరిష్కరించాలి
- ఉద్యోగుల పనితీరుపైనే ప్రభుత్వానికి మంచి పేరు.. చెడ్డ పేరు
- కరీంనగర్ అభివృద్ధిపై మరోసారి పూర్తిస్థాయి సమీక్షకు వస్తా
- గౌరవెల్లి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల కోసం కేంద్రంతో సంప్రదింపులు
- సీఎం రేవంత్‌రెడ్డి

## రూ.1,096 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

రూ.29.62 కోట్లతో నిర్మించనున్న మూడు తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల పనులకు, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్లతో కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. కేఎస్‌సీసీఎల్ స్పెషల్ గ్రాంట్స్ కింద రూ.21.60 కోట్లతో చేపట్టనున్న వరదనీటి మురుగు కాల్వల పనులు, రూ.25 కోట్లతో నిర్మించనున్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ భవనానికి కూడా శంకుస్థాపన చేశారు.అదేవిధంగా రూ.5.70 కోట్లతో నిర్మించిన సెంట్రల్ లైబ్రరీ, రూ.6.50 కోట్లతో నిర్మించిన కాశ్మీర్‌గడ్డ సమీకృత వెజ్--నాన్‌వెజ్ మార్కెట్, రూ.16.50 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డీఆర్‌ఎఫ్ కార్యాలయాలను ప్రారంభించారు.

సమస్యలు, బాధలు, నిస్సహాయతతో కలెక్టరేట్ గడప తొక్కే ప్రతి పేదవాడికి ప్రభుత్వం అండగా ఉందనే నమ్మకం కలిగించేలా సమీకృత జిల్లా కలెక్టరేట్ పనిచేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను కుటుంబ సభ్యుల సమస్యలుగా భావించి పరిష్కరించాలని, వారి కన్నీరు తుడవాలని సూచించారు. ప్రజలకు నమ్మకం, భరోసా కలిగించే విధంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని అన్నారు.బుధవారం కరీంనగర్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.51 కోట్లతో నిర్మించిన నూతన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తదితరులతో కలిసి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

-- కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):

### పేదలకు సేవ చేయడమే ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు అత్యంత నిరుపేద వర్గాలకు చేరేలా ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాలని సీఎం అన్నారు. ప్రభుత్వ ప్రతినిధులుగా ప్రజలకు సేవలందిస్తున్న ఉద్యోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కలెక్టరేట్‌కు సహాయం కోసం వచ్చే ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావించాలని సూచించారు. తమ కుటుంబ సభ్యులకు సమస్య వచ్చినప్పుడు ఎలా స్పందిస్తారో, అదే విధంగా ప్రజల సమస్యలపైనా స్పందించాలని అన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా అధికారులు వ్యవహరించాలని సూచించారు.

### ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం

ప్రజా పాలన ప్రారంభమైన సమయంలో ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించలేని పరిస్థితి రాష్ట్రంలో ఉండేదని సీఎం అన్నారు. ప్రస్తుతం జీతభత్యాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పదోన్నతులు, బదిలీలు, ఆరోగ్య భద్రత కార్డులు తదితర సమస్యలను ఉద్యోగుల సహకారంతో ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర విధానాల్లో సుమారు పదిన్నర లక్షల మంది ఉద్యోగులు నాలుగు కోట్ల మంది ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. సుమారు మూడు శాతం మంది ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవలు అందించడం ఎంతో బాధ్యతతో కూడుకున్న విషయమని పేర్కొన్నారు.

### ప్రభుత్వానికి మంచి పేరు.. చెడ్డ పేరు ఉద్యోగుల పనితీరుపైనే

ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, రూపొందించే చట్టాలు, మంజూరు చేసే నిధులు, అనుమతులను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ఉద్యోగులదేనని సీఎం అన్నారు. ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, సేవలు సక్రమంగా అందకపోతే ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఏర్పడుతుందని పేర్కొన్నారు. కరీంనగర్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి పనులకు కేంద్రం సహకరిస్తే అభినందించేందుకు తనకు ఎలాంటి సంకోచం లేదన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉంటాయని, మిగిలిన సమయంలో కేంద్రంతో సఖ్యతగా ఉంటూ రాష్ట్రానికి అవసరమైన పనులు సాధించుకుంటామని స్పష్టం చేశారు. గౌరవెల్లికి పర్యావరణ అనుమతుల కోసం కేంద్రంతో సంప్రదింపులు గౌరవెల్లి రిజర్వాయర్ పనులు 98 శాతం పూర్తయ్యాయని సీఎం తెలిపారు. సుప్రీంకోర్టులో కేసు కారణంగా మిగిలిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇటీవల అనుకూల తీర్పు వచ్చిన నేపథ్యంలో కేంద్ర జలశక్తి మంత్రిని కలిసి పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. వందల కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టులు నిర్మించినా వాటి వినియోగానికి అవసరమైన అనుమతులు రాకపోతే ప్రయోజనం ఉండదన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

### కంటోన్మెంట్‌లో రహదారికి 170 ఎకరాల డిఫెన్స్ భూమి

హైదరాబాద్ నుంచి కరీంనగర్, నిజామాబాద్ తదితర ఉత్తర తెలంగాణ జిల్లాలకు రాకపోకలకు కంటోన్మెంట్ ప్రాంతం బాటిల్‌నెక్‌గా మారిందని సీఎం అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలను ప్రస్తావించారు. 2023 డిసెంబర్‌లో తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆరు నెలల్లోనే కంటోన్మెంట్ ప్రాంతంలో రహదారి నిర్మాణానికి 170 ఎకరాల డిఫెన్స్ భూమిని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అప్పగించిందని తెలిపారు. బేగంపేట ఎయిర్‌పోర్టు రన్‌వే కారణంగా ఇబ్బంది ఉన్న ప్రాంతంలో టన్నెల్ రోడ్డు నిర్మాణానికి కూడా అనుమతులు లభించాయని చెప్పారు. రూ.5 వేల కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్లు ఏడాది కాలంలో అందుబాటులోకి వస్తాయని సీఎం తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన పనులకు సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపడం మన బాధ్యత అన్నారు.

### అభివృద్ధి కోసం సిద్ధాంత వైరుధ్యాలను పక్కనపెడతాం

ప్రజల అభివృద్ధి కోసం సిద్ధాంతపరమైన వైరుధ్యాలను పక్కనపెట్టి కలిసి పనిచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ నగర అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించేందుకు మరోసారి జిల్లాకు వస్తానని సీఎం ప్రకటించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి బృందానికి కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌ను సీఎం సందర్శించి వేద మంత్రాలు, సర్వమత ప్రార్థనల మధ్య కలెక్టర్ చిత్రా మిశ్రాను కుర్చీలో కూర్చోబెట్టారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టేట్ చాంబర్‌ను పరిశీలించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రత్యేక ఆహ్వానితులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం కలెక్టర్ సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, కరీంనగర్ మేయర్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌ఓ స్వామి, వివిధ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

**ఇల్లంతకుంట సెప్టెంబర్ 30(ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ఇల్లంతకుంట మండలంలోని బీఆర్ఎస్ నాయకులతో పాటుగా, సామాజిక ఉద్యమకారుడు సావనపల్లి రాకేష్ ను ఇల్లంతకుంట పోలీసులు బుధవారం రోజు ముందస్తు అరెస్ట్ చేశారు. అక్రమ అరెస్టులతో ప్రభుత్వం అణిచివేయాలని చూస్తే సహించేది లేదని బీఆర్ఎస్ శ్రేణులు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో గొట్టపర్తి పరశురాములు, రాగిటి రమేష్, పట్నం శ్రీనివాస్, ఎంద్ర చందన్, గుంటి మధు, సామాజిక ఉద్యమకారుడు రాకేష్, రడం ప్రవీణ్, పట్నంశీను, గొట్టపర్తి ఆంజనేయులు, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు



## ఆర్నకొండ లో పౌర హక్కుల దినోత్సవం

**చొప్పదండి, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):** చొప్పదండి మండలం అర్నకొండ గ్రామంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పౌర హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికి గౌరవంతో జీవించే అవకాశం రాజ్యాంగం కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్లూరి లక్ష్మి, ఆర్ఐ త్రిపాల్ సింగ్, గ్రామ పాలన అధికారి వెంకటరెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## మండల స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలు.



**ఎలిగేడు , సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి)** మండల విద్యాధికారి ఏ. నరేంద్ర చారి ఆధ్వర్యంలో బుధవారం ధూళికట్ట ఎంపీపీ ఎస్ భవిత సెంటర్లో మండల స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులను మండల విద్యాధికారి నరేంద్ర చారి, గ్రామ సర్పంచ్ ఎం. కొమురయ్య అభినందించారు. ఈ సందర్భంగా నరేంద్ర చారి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారం కొమురయ్య ,ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బి. చంద్రశేఖర్, యుగంధర్, ఉపాధ్యాయులు, ఐఈఆర్పీ సంతోష్ కుమార్, సీఆర్పీలు పాల్గొన్నారు.

# ర్యాకల్ దేవ్‌పల్లిలో సఫాయి సురక్ష కార్యక్రమం



**ఎలిగేడు, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామ పంచాయతీలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో భాగంగా బుధవారం 'సఫాయి సురక్ష' కార్యక్రమాన్ని సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బందికి ప్రత్యేక హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు అందించారు. అనంతరం గ్రామానికి సేవలు అందిస్తున్న సిబ్బందిని ఘనంగా సన్మానించి.. వారికి సబ్బులు, గ్లౌజులు, బెల్లం తదితర సామాగ్రిని పంపిణీ చేశారు. అలాగే సిబ్బందికి ఇన్సూరెన్స్, ఆరోగ్య భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివకృష్ణ గౌడ్, పంచాయతీ కార్యదర్శి కుక్క అశోక్, వార్డు సభ్యులు ఎడ్ల సతీష్, స్వప్న, జయ, చంద్రకళ, కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

# ర్యాకల్ దేవ్‌పల్లిలో పౌర హక్కుల దినోత్సవం



**ఎలిగేడు, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** గ్రామాల్లో కుల మతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉంటూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఎలిగేడు తహశీల్దార్ యాకన్న పిలుపునిచ్చారు. బుధవారం ఎలిగేడు మండలంలోని ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ యాకన్న మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ కులస్తులపై కుల వివక్ష చూపడం గానీ, రెండు గ్లాసుల పద్ధతి అవలంబించడం గానీ జరుగుతుందో లేదో అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎవరైనా కుల వివక్ష, అంటరానితనం చూపిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సమాజంలో చట్టాలపై ప్రాథమిక అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు, ఆర్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ శ్రవణ్ కుమార్, ఉప సర్పంచ్ శివకృష్ణ గౌడ్, జీపీఓ షఫీ, వార్డు సభ్యులు ఎడ్ల సతీష్, మాడ్లపల్లి జయ, గుడికందుల చంద్రకళ, ఆసంపల్లి స్వప్న, వడ్లపల్లి అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్ మరియు అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వెంగళ హన్మయ్య చిరస్మరణీయుడు సర్పంచ్ కప్పల ప్రవీణ్



**ఎలిగేడు సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ సర్పంచ్, జూలపల్లి మాజీ ఎంపీపీ వెంగళ హన్మయ్య చిరస్మరణీయుడని ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్ అన్నారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో హన్మయ్య 17వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఆనాడే ఎలిగేడు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత హన్మయ్యకే దక్కుతుందని అన్నారు. ఆయన సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నర్సాపూర్ సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్, రాములపల్లి సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్, ఉపసర్పంచ్ ముంజం నరేష్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ గుడుగుల మహేందర్, వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

PRAJA JYOTHI 01-10-2026_1 9/30/2026 11:29 PM Page 4



# బహిరంగ ప్రదేశాల్లో మందు తాగితే ఖేల్ ఖతం!



- అనుమతి లేని డ్రోన్లు, డీజే ధ్వనులపై కఠిన చర్యలు
- పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

**మంథని, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):**
సాధారణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మద్యం మత్తులో వీధులు, రహదారులపై అసభ్య పదజాలంతో ప్రవర్తించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిషేధాజ్ఞలు విధించినట్లు పేర్కొన్నారు. ఈ నిషేధాజ్ఞలు అక్టోబర్ 01 నుంచి నవంబర్ 012026 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**డీజే ధ్వనులు, డ్రోన్లపై నిషేధాజ్ఞల పొడిగింపు**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో డీజే ధ్వనుల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఇబ్బంది కలగకుండా, శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు అధిక శబ్దంతో కూడిన డీజే ధ్వనుల వినియోగంపై నిషేధం విధించినట్లు తెలిపారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజలను సమీకరించేందుకు డీజే ధ్వనులను వినియోగిస్తున్నట్లు గమనించామని పేర్కొన్నారు. అయితే, కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మైక్ సెట్ వినియోగానికి సంబంధించి నిర్దిష్ట మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు నేటి ఉదయం 6.00 గంటల నుంచి నవంబర్ 1 ఉదయం 6.00 గంటల వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో రామగుండం పోలీస్ కమిషనరేట్ యాక్ట్--2016లోని సెక్షన్ 7(1), సెక్షన్ 22(1)(ఏ) నుంచి (ఎఫ్) సెక్షన్ 22(2)(ఏ), (బి) సెక్షన్ 22(3), సిటీ పోలీస్ యాక్ట్, 1348 నం. 9 ఫసలీ, పోలీస్ యాక్ట్-1861లోని సెక్షన్ 30 ప్రకారం నేటి ఉదయం 6.00 గంటల నుంచి నవంబర్ 1 ఉదయం 6.00 గంటల వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కాలంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందుగా సంబంధిత పోలీస్ అధికారుల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బంద్‌ల పేరుతో సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, ఒత్తిడి చేయడం, బెదిరింపులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

## సుద్దాల గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**కోనరావుపేట, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):**
కోనరావుపేట మండలంలోని సుద్దాల గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎల్లమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా పల్లి రఘు గౌడ్, ఉపాధ్యక్షుడిగా పల్లి సత్తయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా బుర్ర మల్లేశం, పల్లి బాలయ్య, రమేష్, శ్రీనివాస్, జగదీష్, బుచ్చి రాములు, శ్రీనివాస్, రాములు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు అభినందనలు తెలపగా.. గౌడ సంఘ అభివృద్ధికి, కుల బాంధవుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు పల్లి రఘు గౌడ్ పేర్కొన్నారు.



## పీఎం సూర్యఘర్ సేవా సేతు అవగాహన సదస్సులు

### ...ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

పెద్దపల్లి, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):
ఇళ్లపై సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలు, విద్యుత్ వినియోగదారుల్లో అవగాహన కల్పించేందుకు కేంద్ర నూతన పునరుద్ధరణీయ ఇంధన మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, టీజీఎన్పీడీసీఎల్, టీజీ రెడ్కోలు సంయుక్తంగా 'పీఎం సూర్యఘర్ సేవా సేతు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్, రెడ్కో జిల్లా మేనేజర్ మనోహర్ తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని విద్యుత్ డివిజన్ కేంద్రాల్లో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సౌర విద్యుత్ ఫలకాలు అమర్చుకోవాలనుకునే వినియోగదారులు అక్కడికక్కడే నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి డివిజన్ కేంద్రంలోని టౌన్-1 సెక్షన్ కార్యాలయంలో, మంథని డివిజన్ కేంద్రంలోని డివిజన్ కార్యాలయంలో ఈ ప్రత్యేక స్టాళ్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ పథకం ద్వారా మూడు కిలోవాట్ల సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే రూ.78 వేల వరకు సబ్సిడీ పొందవచ్చని, సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లు గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. కరీంనగర్, హుజూరాబాద్, జగిత్యాల, మెట్‌పల్లి, పెద్దపల్లి, మంథని, సిరిసిల్ల, వేములవాడ విద్యుత్ డివిజన్ కార్యాలయాల ఆవరణలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సదస్సులలో బ్యాంకర్లు, సౌర విద్యుత్ విక్రేతలు, డిస్కం మరియు రెడ్కో అధికారులు పాల్గొని వినియోగదారులకు పథకంపై పూర్తి అవగాహన కల్పిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# ముందస్తు అరెస్టులను ఖండించిన సర్పంచుల ఫోరం



**ముస్తాబాద్,సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో వివిధ గ్రామాల సర్పంచులు, టీఆర్ఎస్, బీజేపీ నాయకులను తెల్లవారుజామునే ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ముస్తాబాద్ మండల సర్పంచుల ఫోరం తీవ్రంగా ఖండించింది. గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్న సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేయడం బాధాకరమని ముస్తాబాద్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, బదనకల్ సర్పంచ్ చిగురు నరేష్ అన్నారు. సర్పంచులుగా ఎన్నికై తొమ్మిది నెలలు గడుస్తున్నప్పటికీ గ్రామపంచాయతీలకు రావాల్సిన రాష్ట్ర నిధులు ఇంకా అందలేదని తెలిపారు. మేజర్ గ్రామపంచాయతీలకు రూ.10 లక్షలు, చిన్న గ్రామపంచాయతీలకు రూ.5 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ నిధులు అందక గ్రామాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. దసరా పండుగ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తారనే ఆశతో సర్పంచులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా గ్రామాల ప్రథమ పౌరులైన సర్పంచులకు సీఎంను కలిసి తమ సమస్యలను సామరస్యపూర్వకంగా వివరించే అవకాశం కల్పించి ఉంటే బాగుండేదని అన్నారు. సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేయడం కంటే వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# సిరిసిల్ల సభకు వేములవాడ నుండి ట్రాక్టర్ల ప్రభంజనం

- **మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**
- **శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులతో కాంగ్రెస్ శ్రేణుల కదం తొక్కిన ఉత్సాహం**





**వేములవాడ,సెప్టెంబర్,30 ప్రజాజ్యోతి:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి బహిరంగ సభకు మద్దతుగా వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ఆధ్వర్యంలో దాదాపు 100 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దివ్య ఆశీస్సులతో వేములవాడ ప్రజలు, రైతులు, మహిళలు, యువత స్వచ్ఛందంగా తరలివచ్చారని చైర్మన్ తెలిపారు. శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి వేగవంతమైందని, ముఖ్యంగా 500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి దశకు రావడం, ఉచిత ఇసుక అనుమతులు కల్పించడంతో ట్రాక్టర్ యజమానులు, కార్మికులకు నిరంతరం ఉపాధి లభిస్తోందని పేర్కొన్నారు. ఉపాధి కల్పించిన ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు మద్దతుగా ఈ ర్యాలీ చేపట్టినట్లు నేతలు వెల్లడించారు. పుల్కం రాజు స్వయంగా ట్రాక్టర్ నడిపి శ్రేణుల్లో ఉత్సాహం నింపారు.

# బ్యాంకింగ్ లావాదేవీల్లో అప్రమత్తత అవసరం



- **ఆశ, భయాన్ని ఆసరాగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు**
- **కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఉదయశ్రీ హెచ్చరిక**

**మంథని, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):** బ్యాంకింగ్ లావాదేవీలు, డిజిటల్ చెల్లింపుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ కె. ఉదయశ్రీ సూచించారు. బుధవారం మంథని మండలం వెంకటాపూర్ గ్రామంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. లోన్ యాప్‌లు, లాటరీలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, పాన్-ఆధార్ లింకేజీ పేరుతో వచ్చే అనుమానాస్పద లింక్‌లను నమ్మవద్దని, ఓటీపీలు, ఏటీఎం పిన్‌లు ఎవరికీ వెల్లడించవద్దని కోరారు. అలాగే రైతులు, ప్రజల కోసం సహకార బ్యాంకు ద్వారా కిసాన్ క్రెడిట్ కార్డు, పంట రుణాలు, పాడి పశువులు, గృహ, వ్యాపార, వ్యక్తిగత రుణాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. డిజిటల్ సేవలైన యూపీఐ, గూగుల్‌పే, ఫోన్‌పే వినియోగించుకోవాలని, డిపాజిట్లపై అత్యధికంగా 8 శాతం వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. రూ.436తో పీఎం జీవన్ జ్యోతి, రూ.20తో సురక్ష బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రమేష్ టీం బుర్రకథ ప్రదర్శనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సర్పంచ్ తోట పోచయ్య, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## శాయంపేట కాంగ్రెస్ గ్రామ శాఖ ఏకగ్రీవ ఎన్నిక

**ధర్మారం, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి ):** శాయంపేట గ్రామంలో సర్పంచ్ కూస శ్రీవాణి తిరుపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా చేనెల్లి సత్తయ్య, ఉపాధ్యక్షులుగా ఆవుల రాజయ్య,పొన్నం సంతోష్, ప్రధాన కార్యదర్శిగా బొడిగే నర్సయ్య, కార్యదర్శిగా దయ్యాల రమేష్ ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శులుగా బొడిగే మొండయ్య,కాంపెల్లి రాజేశం,దూడ లింగయ్య, కోశాధికారిగా ఆవుల పోశయ్యను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా జాగేటి లచ్చయ్య, బొడిగే శంకరయ్య, కాంపెల్లి ఎషమ్మ, ఐలవేని అంజయ్య, దయ్యాల మల్లేశం, దయ్యాల భాగ్యమ్మ, కూకట్ల పోశయ్య ఎంపికయ్యారు. పార్టీ సలహాదారులుగా సింగిరెడ్డి భూపతి రెడ్డి,కూకట్ల ఓదెలును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దయ్యాల రజిత రాకేష్, మాజీ సర్పంచ్ చేనెల్లి సాయికుమార్,మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి సేవిస్తే కఠిన చర్యలు

**...ధర్మారం ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరిక**

ధర్మారం, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి): బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, పార్కులు, ఖాళీ స్థలాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మారం ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మత్తులో వాహనాలు నడిపితే ప్రాణాలకే ప్రమాదమని పేర్కొన్నారు. అలాగే గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం తెలిస్తే పోలీసులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. శాంతిభద్రతలు, రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.





## మహాత్మానగర్ లో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

**తిమ్మాపూర్,సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పౌర హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికి గౌరవంతో జీవించే అవకాశం రాజ్యాంగం కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొన్నాల సంపత్ ఉపసర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి,వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అంబేద్కర్ సంఘం నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సేర్ప్ ఏపీఎంగా ఎస్. నర్సమ్మ బాధ్యతలు

**ధర్మారం,సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):**



ధర్మారం మండల సేర్ప్ కార్యాలయంలో ఏపీఎం (అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్)గా పనిచేస్తున్న డి. పోచం జిల్లా డీఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జిల్లా డీఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్.నర్సమ్మ బదిలీపై ధర్మారం మండల సేర్ప్ ఏపీఎంగా నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్. నర్సమ్మ త్వరలో ధర్మారం మండల సేర్ప్ ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించనున్నారు. మండలంలోని స్వయం సహాయక సంఘాలు, మహిళా సంఘాల కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆమె కీలకంగా వ్యవహరించనున్నారు

## ఘనంగా సాయిని రవి జన్మదిన వేడుకలు

**జమ్మికుంట, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):**



టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యులు సాయిని రవి జన్మదిన వేడుకలను జమ్మికుంటలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మల గుడి శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి, సాయిని రవికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరమనేని పరశురాములు, పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్, మార్కెట్ డైరెక్టర్ రాజేశ్వర్ రావు, శ్రీనివాస్ యాదవ్, పిట్టల రమేష్, వినయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వియత్నాం విద్యా పర్యటనకు మంథని ఉపాధ్యాయుడు భరత్ రెడ్డి ఎంపిక

### ...మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

**మంథని, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల 'ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్'కు మంథని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు గీట్ల భరత్‌రెడ్డి ఎంపికయ్యారు. అంతర్జాతీయ విద్యా పర్యటనకు ఎంపికైన సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు భరత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తూ వియత్నాం విద్యా పర్యటనకు ఎంపిక కావడం మంథని ప్రాంతానికే గర్వకారణమని



కొనియాడారు. ఈ విద్యా పర్యటన ద్వారా అంతర్జాతీయ స్థాయి విద్యా విధానాలు, నూతన బోధనా పద్ధతులను తెలుసుకునే గొప్ప అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు కుర్ర లింగయ్య, నూకల కమల్, మాచిడి రాజు గౌడ్, మద్దికట్ల స్రవంతి, పోతరబోయిన శ్రీలత, జంబోజు శ్రీమతి, లైశెట్టి రజిత, మారుపాక నిహారిక, పెంటరి రాజు, వేములు లక్ష్మి, యెల్లంకి వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

- విద్యుత్ అంతరాయాలపై బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా
- జమ్మికుంట కొత్తపల్లి విద్యుత్ ఆఫీస్ ఎదుట నిరసన



**ఇల్లందకుంట,సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలను నిరసిస్తూ బీజేపీ ఇల్లందకుంట మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జమ్మికుంట కొత్తపల్లి విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు, ఎల్-నినో ప్రభావంతో పంటలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇలాంటి సమయంలో విద్యుత్ అంతరాయాలు కలిగించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని, వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు రవీందర్ రెడ్డి, సతీష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు పావని, పలువురు నేతలు, రైతులు పాల్గొన్నారు.

# గంగాధరలో జర్నలిస్టుల అత్యవసర సమావేశం





- వైద్యాధికారి దురుసు ప్రవర్తనపై తీవ్ర ఖండన
- డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓకు డిమాండ్

**గంగాధర, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** గంగాధర మండల కేంద్రంలో బుధవారం జర్నలిస్టులు అత్యవసర సమావేశం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా జర్నలిస్టుల దాడుల కమిటీ అధ్యక్షుడు శ్రీరాం రవీందర్ ఆధ్వర్యంలో, మండల జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు జారతి రాజిరెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వార్తా సేకరణ కోసం వెళ్లిన 'నవ తెలంగాణ' విలేకరి చిందం రాజమౌళి పట్ల వైద్యాధికారి సౌమ్య ప్రవర్తించిన దురుసు ప్రవర్తనను జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. సీనియర్ పాత్రికేయుడి పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఈ ఘటనపై కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్పందించి తగిన విచారణ జరిపించాలని, విధులకు ఆటంకం కలిగించిన వైద్యాధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి లాంగ్ టెన్నిస్ పోటీలు ప్రారంభం



మంథని, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పాఠశాలల క్రీడల్లో భాగంగా మంథని ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సింథటిక్ కోర్ట్ లో బుధవారం లాంగ్ టెన్నిస్ పోటీలను మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ ప్రారంభించారు. మంథని సింథటిక్ కోర్ట్ లో అండర్ 14, అండర్ 17 బాలుర, బాలికల లాంగ్ టెన్నిస్ పోటీలు ప్రారంభం కాగా ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 12వ తేదీన హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని మంథని జోన్ సెక్రెటరీ, పెద్దపెల్లి జిల్లా ఎస్జీఎఫ్ సెక్రెటరీ కనకొండ లక్ష్మణ్, ఆర్గనైజర్ కొమురోజు శ్రీనివాస్ లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు సహాయ సహకారాలతో నిర్మించిన ఈ సింథటిక్ టెన్నిస్ కోర్ట్ ఇక్కడ క్రీడాకారులను అభివృద్ధి పరిచి రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే విధంగా ఉపయోగం లోకి తీసుకువస్తున్న నిర్వాహకులను అభినందించారు. అంతేకాకుండా ఇక్కడ క్రీడాకారులు అందరు జాతీయస్థాయిలో రాణించాలని అభిలాషించారు. ఇకముందు జరిగే క్రీడలన్నింటికీ తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు అల్పాహారాన్ని చైర్మన్ శ్రీనివాస్ అందించారు.

# సుగ్లాంపల్లి 132 కేవీ సబ్‌స్టేషన్ ఎదుట బీజేపీ ధర్నా



- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ ఈటల రాజేందర్ మండిపాటు
- రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్

సుగ్లాంపల్లి, సెప్టెంబరు 30(ప్రజా జ్యోతి) రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. బీజేపీ పిలుపు మేరకు సుగ్లాంపల్లి 132 కేవీ సబ్‌స్టేషన్ ఎదుట మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యుత్ కోతల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అనంతరం విద్యుత్ డీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా, యువమోర్చా, మహిళా మోర్చా నాయకులు, స్థానిక బీజేపీ ప్రతినిధులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉష జాతీయ క్రీడలకు సాన్వి విద్యార్థులు

- రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాల పంట
- సాన్వి విద్యాసంస్థల చైర్మన్ ఎర్రంశెట్టి మునీందర్ వెల్లడి




కొత్తపల్లి, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి): హైదరాబాద్ నాంపల్లి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన 70వ ఎస్జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి ఉష క్రీడల్లో సాన్వి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునీందర్ తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించిన గడ్డం చిన్నబాబు స్వర్ణ పతకం సాధించగా, ఏనుగు విగ్నేశ్వర్, గుండేటి లక్ష్మీ ప్రసన్న వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. 65 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించిన గడ్డం చిన్నబాబు అక్టోబర్ 15 నుండి 19 వరకు జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొననున్నట్లు ఎస్జీఎఫ్ కరీంనగర్ సెక్రటరీ జి.బన్నీలాల్ వెల్లడించారు. విజేతలను ఎస్జీఎఫ్ సెక్రటరీ బన్నీలాల్, చైర్మన్ మునీందర్, కోచ్‌లు శ్రీనివాస్, స్వర్ణ, లక్ష్మణరావు, డీన్ మోహన్, ప్రిన్సిపల్ రత్నాకర్ మరియు అధ్యాపక బృందం అభినందించారు.




## పారిశుద్ధ్య కార్మికులకు శాలువాలతో ఘన సన్మానం

ధర్మారం, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి న్యూస్): స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా చామనపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించి నూతన వస్త్రాలు,నిత్యావసర సరుకులు అందజేశారు. గ్రామ సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు సుందరగిరి శంకరయ్య, పాలోజీ రమణాచారి, మామిడిపెల్లి విజయలను సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు మాట్లాడుతూ గ్రామ పారిశుద్ధ్య పరిరక్షణలో కార్మికుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. అనంతరం కార్మికులకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తాళ్ల కిరణ్, ఉపసర్పంచ్ తిగుళ్ల కవిత సతీష్ రెడ్డి, వార్డు సభ్యులు రాపెల్లి శ్రీకాంత్, బేధగం హారిక అంజయ్య, నిట్టు లక్ష్మి రాయలింగం, దాసరి సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగ విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలు

మంథని, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి): మంథని మండలంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు బుధవారం మండల స్థాయి ఆటల పోటీలను ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి హాజరైన దివ్యాంగ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో శ్రీజరెడ్డి, ఎంఈఓ లక్ష్మి హాజరై మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఇతర విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను కూడా అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని, సమాజం వారి పట్ల సానుకూల దృక్పథంతో సహకరించాలని సూచించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విలీన విద్యా ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేష్, సౌజన్య, సంబంధిత సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి మున్నూరు కాపుల ఘన స్వాగతం

- చంద్రంపేట చౌరస్తాలో పూలమాలలతో ఆత్మీయ సత్కారం
- సిరిసిల్ల సభకు భారీగా తరలివెళ్లిన మున్నూరు కాపు సంఘం సభ్యులు





**వేములవాడ, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** సిరిసిల్లలో బుధవారం నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభకు వెళ్తున్న ముఖ్యమంత్రికి వేములవాడ మండల మున్నూరు కాపు కుల సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. చంద్రంపేట చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి కాన్వాయ్ చేరుకున్న సందర్భంగా మున్నూరు కాపు సంఘం నాయకులు, కుల బాంధవులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆయనను పూలమాలలతో ఆత్మీయంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

**భారీగా బైక్ ర్యాలీ:**

సిరిసిల్ల బహిరంగ సభకు వేములవాడ మండలం నుంచి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సభ్యులు తరలివెళ్లారు. సంఘం నాయకులు, యువత, కుల బాంధవులు పెద్ద సంఖ్యలో బైక్‌లపై ర్యాలీగా బయలుదేరి సిరిసిల్ల సభకు చేరుకున్నారు. భారీ సంఖ్యలో బైక్‌లు పాల్గొనడంతో వేములవాడ నుంచి సిరిసిల్ల మార్గంలో సందడి వాతావరణం నెలకొంది.

**ఐక్యతను చాటిన మున్నూరు కాపు సమాజం:**

మున్నూరు కాపు సంఘం పిలుపు మేరకు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి సంఘం సభ్యులు, యువత, మహిళలు, కుల బాంధవులు ఉత్సాహంగా తరలివచ్చి తమ ఐక్యతను, సంఘటిత శక్తిని చాటారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్వాగతం పలకడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ పర్యటనను పురస్కరించుకుని చేపట్టిన బైక్ ర్యాలీ మరియు బహిరంగ సభ విజయవంతం కావడంపై నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మండల మున్నూరు కాపు కుల సంఘం నాయకులు, ప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ,కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాతవాహన వర్సిటీలో అధునాతన పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలి

**...సీఎం రేవంత్‌రెడ్డికి వీసీ ఉమేష్‌కుమార్ వినతి**

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** శాతవాహన విశ్వవిద్యాలయంలో నూతన అధునాతన పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్ కోరారు. కరీంనగర్ జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రిని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి వీసీ కలసి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యార్థుల భవిష్యత్తు, ఉన్నత విద్యా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వర్సిటీలో పరిశోధనా వసతులు మెరుగుపడితే స్థానిక విద్యార్థులకు, యువతకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. శాతవాహన విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## పారమిత పాఠశాలలో జీవవైవిధ్య అవగాహన




**కరీంనగర్ టౌన్,సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):** స్థానిక పారమిత ఉన్నత పాఠశాలలో "సుస్థిరత–జీవవైవిధ్య పరిరక్షణ" అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశ్యమని ప్రధానోపాధ్యాయులు పి. ప్రశాంత్ తెలిపారు. ప్రాజెక్ట్ హెడ్, ఎకో క్లబ్ మెంటార్లు లలిత్ మోహన్ సాహు, అనిల్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు జీవవైవిధ్య పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణపై వివిధ కార్యక్రమాలు ప్రదర్శించారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, పోస్టర్ తయారీ, మొక్కల పెంపకం తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వన్యప్రాణులను సంరక్షించడం ద్వారా ప్రతి విద్యార్థి ప్రకృతి సంరక్షకుడిగా మారాలని ప్రధానోపాధ్యాయులు పిలుపునిచ్చారు. విద్యార్థులు "భూమాతను, ప్రకృతిని పరిరక్షిస్తాం" అంటూ ప్రతిజ్ఞ చేశారు. జీవవైవిధ్య థీమ్ సాంగ్, నాటిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల అధినేత డా. ఇనుగంటి ప్రసాద్ రావుతో పాటు డైరెక్టర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## కరీంనగర్ అభివృద్ధికి రూ.350 కోట్లు మంజూరు చేయాలి

**సీఎం రేవంత్‌రెడ్డికి మేయర్ కొలగాని శ్రీనివాస్ వినతి**



**కరీంనగర్ బ్యూరో,సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):** నూతన కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవానికి కరీంనగర్ వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో కలిసి సీఎంను కలసి నగర అభివృద్ధిపై వినతిపత్రం అందజేశారు. సీఎం అష్యూరెన్స్ కింద ఇప్పటికే మంజూరైన రూ.50 కోట్ల పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని మేయర్ కోరారు. నిధుల విడుదలలో జాప్యంతో పలు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో కొత్తగా విలీనమైన గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, స్టార్మ్ వాటర్ డ్రైన్లు, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్య సదుపాయాల కల్పనకు రూ.300 కోట్ల ప్రత్యేక సీఎం అష్యూరెన్స్ నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నగర విస్తరణకు అనుగుణంగా పాత నగరంతో పాటు విలీన గ్రామాలను కూడా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.

PRAJA JYOTHI 01-10-2026_1 9/30/2026 11:29 PM Page 9





## అంటరానితనం నిర్మూలనకు అందరూ పాటుపడాలి

**...మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీధర్**

**కాల్వ శ్రీరాంపూర్, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** సమాజంలో అంటరానితనం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాటుపడాలని మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీధర్ సూచించారు. బుధవారం కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెద్దంపేట గ్రామంలో అంటరానితనం నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలోని దళితవాడలను సందర్శించి, స్థానికుల సమస్యలను, బాగుగోగులను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో అసమానతలు తొలగిపోయినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ నాయకులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బందెల లక్ష్మి మృతి -- అన్నారంలో శోకసంద్రం



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన సమాజ సేవకురాలు బందెల లక్ష్మి శాశ్వతంగా కన్నుమూశారు. గ్రామంలోని వందలాది కుటుంబాలకు ఆపద్బాంధవురాలిగా, ఏ కష్టం వచ్చినా ఆదుకునే పెద్ద దిక్కుగా ఉన్న ఆమె మరణంతో అన్నారంలో శోకసంద్రం నెలకొంది. ఆమె పార్థివ దేహాన్ని దర్శించుకునేందుకు వేలాది మంది తరలివచ్చి, సొంత తల్లిని కోల్పోయినట్లుగా కన్నీరు మున్నీరయ్యారు. అంతిమ యాత్రలో కుటుంబ సభ్యులు బందెల మహేందర్, రమేష్, శ్రీవాణి, మహేశ్వరి, శాంతి కుమార్, హిమజ, మనీష్, ఇతర కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొని అశ్రు నయనాల మధ్య వీడ్కోలు పలికారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ జన్మదిన వేడుకలు

**చిగురుమామిడి, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో చిగురుమామిడి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి, నాయకులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కర్వేద మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు బోయిని రమేష్, బెజ్జంకి లక్ష్మణ్, ఉప సర్పంచులు కాశబోయిన విజయలక్ష్మి, కాసర్ల హరీష్, రైతుబంధు సభ్యులు తిరుపతి, మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సర్వర్ పాషా, గ్రామ శాఖ అధ్యక్షుడు రాజు, నాయకులు సన్నిల మల్లేశం, పిల్లి వేణు, బుర్ర తిరుపతి, నాగేల్లి రాజిరెడ్డి, శ్యామకూర సంపత్ రెడ్డి, జక్కుల రవీందర్, అశోక్, నాగిరెడ్డి, సందీప్ రెడ్డి, శరభంద రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెలు, మేకలకు బీమా పథకం చారిత్రాత్మకం

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ధర్మారం, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** గొల్ల కురుమల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గొర్రెలు, మేకలకు రాష్ట్ర ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిన సందర్భంగా ధర్మారం మండల కేంద్రంలో గొర్రెల పెంపకదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి గొల్ల కురుమల సమస్యలను తీసుకెళ్లగానే స్పందించి ఈ బీమా పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. ఏడాదికి ఒక్కో జీవానికి యజమాని రూ.13 చెల్లిస్తే, మిగిలిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని, దీనివల్ల పశు సంపద నష్టపోతే గొర్రెల కాపరులకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. అనంతరం యాదవ సంఘం నాయకులు మంత్రిని గొంగడితో సత్కరించి, గొర్రె పిల్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు సంగ రంజిత్ యాదవ్, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగ మహేందర్ యాదవ్, యాదవ సభ నాయకులు ద్యాగేటి ఉదయ్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రూప్ల నాయక్, నాయకులు, సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం సభకు కాంగ్రెస్ శ్రేణుల భారీ తరలింపు



**వేములవాడ, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** సిరిసిల్లలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు వేములవాడ రూరల్ మండలంలోని వెంకటంపల్లి గ్రామం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా సభకు బయలుదేరి వెళ్లారు. గ్రామం నుంచి ప్రత్యేకంగా బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు సీఎం సభకు హాజరై తమ మద్దతును చాటారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పార్టీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. సీఎం సభకు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, నాయకులు తరలివెళ్లడంతో వెంకటంపల్లిలో రాజకీయ సందడి నెలకొంది.

# సీఎం రేవంత్ రెడ్డికి నంది విగ్రహ ప్రతిమ బహుకరణ

**ప్రభుత్వ విప్ ఆది సమక్షంలో సీఎంను కలిసిన వేములవాడ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్**



**వేములవాడ, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. సిరిసిల్లలో నిర్వహించిన భారీ బహిరంగ సభ ముగిసిన అనంతరం, స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ ముఖ్యమంత్రికి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దివ్య స్వరూపానికి ప్రతిరూపమైన నంది విగ్రహ ప్రతిమను సీఎం రేవంత్ రెడ్డికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి రాజన్న ప్రసాదం

**అందజేసిన రాజన్న ఆలయ ఈవో రమాదేవి**





**వేములవాడ, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేవాదాయ శాఖ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ హనుమంతరావు (ఐఏఎస్), వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి శేషవస్త్రాన్ని ఆలయ అర్చకులు, వేద పండితులు సీఎంకు అందజేసి వేదాశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ ఈవో ఎల్. రమాదేవి ముఖ్యమంత్రికి స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని బహుకరించారు.

# వస్త్ర పరిశ్రమకు చిరునామా సిరిసిల్ల



ధైర్యం, దైవం కలిసి వెలిసిన ప్రాంతం సిరిసిల్ల అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో దైవచింతనతో పాటు, నిజాం రజాకార్లపై పూర్వీకులు చేసిన పోరాటానికి సిరిసిల్ల ప్రజలు వారసులని పేర్కొన్నారు. సిరిసిల్ల అంటే సిరులకు నిలయమని, అయితే గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల 'ఉరిసిల్ల'గా మారిందని విమర్శించారు. బుధవారం సిరిసిల్లలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చిరునామాగా ఉందని, వేలాది కుటుంబాలు చేనేత, వస్త్ర పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన చీరలను తయారు చేసే నైపుణ్యం ఇక్కడి కార్మికుల సొంతమని చెప్పారు.

-- కరీంనగర్ బ్యూరో,సిరిసిల్ల, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):

- గత బీఆర్ఎస్‌పాలనలో సిరిసిల్ల ఉరిసిల్లగా మారింది
- చేనేత కార్మికుల ఆత్మహత్యలు, గల్ఫ్ వలసలను గత పాలకులు అడ్డుకోలేదు
- నేత కార్మికుల కోసం ప్రజా ప్రభుత్వం రూ.1,741 కోట్లు ఖర్చు చేసాం
- రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1,700 కోట్ల నిధులు మంజూరు
- కుటుంబ పాలన కావాలా.. ప్రజా పాలన కావాలా?
- సిరిసిల్లలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి
- సిరిసిల్ల బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి





**నేత కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శ**

2009 నుంచి 2023 వరకు పలుమార్లు ఎన్నికల్లో గెలిచినప్పటికీ చేనేత కార్మికుల ఆత్మహత్యలను ఎందుకు అడ్డుకోలేదని గత పాలకులను సీఎం ప్రశ్నించారు. కార్మికుల గల్ఫ్ వలసలు ఎందుకు ఆగలేదో ప్రజలు ఆలోచించాలని సూచించారు. విదేశాల్లో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక విధానం తీసుకొచ్చామని, విదేశాల్లో ప్రమాదవశాత్తు మరణించే కార్మికుల మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడంతో పాటు వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

**కేసీఆర్ కుటుంబంపై తీవ్ర ఆరోపణలు**

గత పాలకులపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ కుటుంబం ప్రజల ఓట్లను ఉపయోగించుకుని భారీగా ఆస్తులు కూడబెట్టుకుందని ఆరోపించారు. అమెరికాలో ఉద్యోగాలు చేసిన కాలంలో వేల కోట్లు ఎలా సంపాదించారనే విషయాన్ని కేటీఆర్ వెల్లడించాలని వ్యాఖ్యానించారు.

గోదావరి జలాలు, మానేరు ఇసుక విషయంలో గత పాలకులపై ఆరోపణలు చేస్తూ నేరెళ్ల ఘటన బాధితులను సజీవ సాక్ష్యాలుగా సీఎం ప్రస్తావించారు. మిడ్ మానేరు ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో కేసీఆర్ కుటుంబ సభ్యులు ఇళ్ల స్థలాలు పొందారంటూ ఆరోపించారు.

**వెయ్యి రోజుల పాలనలో నేత కార్మికులకు రూ.1,741 కోట్లు**

ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో నేత కార్మికుల కోసం రూ.1,741 కోట్లు ఖర్చు చేసిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1,700 కోట్ల నిధులు మంజూరు చేశామని, వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేశామని చెప్పారు. వేములవాడ ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, ఎమ్మార్వో కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

**సిరిసిల్లలో మార్పు రాబోతోంది**

సిరిసిల్లలో మార్పు రాబోతోందని సీఎం అన్నారు. రానున్న శాసనమండలి ఎన్నికల్లో పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఎమ్మెల్సీగా పంపించాలని ప్రజలను కోరారు. సిరిసిల్లలో కాంగ్రెస్ తరఫున గెలిచిన అభ్యర్థికి తన మంత్రివర్గంలో స్థానం కల్పిస్తామని ప్రకటించారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీలు 9, 10, 11, 12 పూర్తి చేయకుండా పెండింగ్‌లో ఉంచడం వల్ల సిరిసిల్ల ప్రాంత రైతులకు గోదావరి జలాలు అందలేదని ఆరోపించారు. మానేరు నదిపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు దెబ్బతిన్నాయని, వాటి నిర్మాణంలో అవినీతి జరిగిందని విమర్శించారు.

**కుటుంబ పాలననా.. ప్రజా పాలననా?**

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, ఇతర నేతలు మంత్రులుగా ఉన్నారని, తన ప్రభుత్వంలో మాత్రం సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన నేతలకు మంత్రి పదవులు దక్కాయని సీఎం అన్నారు. కుటుంబ పాలన కావాలో, ప్రజా పాలన కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని సూచించారు. గత పదేళ్లలో పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం తగిన స్థాయిలో జరగలేదని విమర్శించారు. రేషన్ కార్డులు ఇవ్వలేదని, బతుకమ్మ చీరల పంపిణీలోనూ అవినీతి జరిగిందని ఆరోపించారు.

**సంక్షేమ పథకాలతో పేదలకు అండ**

బతుకమ్మ చీరలకు సంబంధించి గత ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.350 కోట్ల బకాయిలను తమ ప్రభుత్వం చెల్లించిందని సీఎం తెలిపారు. రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని కోటి ఆరు లక్షల కుటుంబాలకు చెందిన 3.46 కోట్ల మంది లబ్ధిదారులకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని, ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.12 వేల కోట్లు చెల్లించిందన్నారు. ఈ పండుగ సందర్భంగా చిలక చీరలను ప్రభుత్వం పంపిణీ చేయనుందని తెలిపారు.

**రైతులకు రూ.36 వేల కోట్ల రైతుభరోసా**

రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు, రుణమాఫీ కింద రూ.20,614 కోట్లు రైతులకు చెల్లించామని రేవంత్‌రెడ్డి తెలిపారు. 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతాచారి తల్లి సహా ఉద్యమ, సామాజిక నేపథ్యం ఉన్న కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, చాకలి ఐలమ్మ కుటుంబ సభ్యులను మహిళా కమిషన్ సభ్యులుగా నియమించామని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ విప్‌లు, ప్రభుత్వ సలహాదారులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# 5 అడుగుల సెట్‌బ్యాక్ వదిలి నూతన నిర్మాణాలు చేపట్టాలి

- మంథని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం
- మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ వెల్లడి

**మంథని, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):**
మంథని మున్సిపల్ పరిధిలో ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రజలు తప్పనిసరిగా 5 అడుగుల సెట్‌బ్యాక్ వదిలి నిర్మాణాలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన, కమిషనర్ మనోహర్ సమక్షంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బతుకమ్మ ఆడటానికి గ్రావెల్ వేయడం, నిమజ్జన చెరువుల వద్ద లైటింగ్, దసరా సందర్భంగా జమ్మి చెట్టు వరకు లైటింగ్ మరియు సుందరీకరణ పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో పట్టణాభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సెట్‌బ్యాక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కట్టడాలను తొలగిస్తామని హెచ్చరించారు. మరో మూడు రోజుల్లో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్-వెజ్ మార్కెట్ పనులు ప్రారంభిస్తామని, వచ్చే గోదావరి పుష్కరాల నాటికి మంథనిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అలాగే రాబోయే రెండు నెలల్లో మంథనిని ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్లాస్టిక్ వాడితే జరిమానాతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

## గుల్లకోటలో పౌర హక్కులపై అవగాహన

**ఎండపల్లి, సెప్టెంబరు 30 ,ప్రజాజ్యోతి**
రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పలువురు సూచించారు. కుల, మత, వర్గ భేదాలకు తావులేకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో మండలంలోని గుల్లకోట గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు రాజ్యాంగ హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వివక్ష, అంటరానితనం వంటి అంశాలపై చర్చించారు. హక్కులు, చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే వాటిని సక్రమంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ



కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ అన్వేష్, సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్‌గౌడ్, గ్రామ కార్యదర్శి కొమురయ్య, వివిధ శాఖల అధికారులు,వార్డు సభ్యులు మూల ప్రశాంత్, పాలకుర్తి తిరుపతి, గౌర్ చంద్రమౌళి, ఏఈఓ లావణ్య, ఐకేపీ సీసీ శ్రీనివాస్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిందర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధి హామీ సహాయకులు రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# 3.94 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):**
జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 18 మంది బాధితులకు మంజూరైన రూ. 3,94,500 విలువగల సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్సీ ఎల్. రమణ క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందిన బాధితులు ఆర్థిక సాయం కోసం ఎమ్మెల్సీని ఆశ్రయించగా, ఆయన స్పందించి ప్రభుత్వం నుంచి ఈ నిధులను మంజూరు చేయించారు. ఎమ్మెల్సీ ఆదేశాల మేరకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని, సకాలంలో సాయం అందేలా ఎమ్మెల్సీ ఎల్. రమణ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. తమకు ఆర్థిక ఊరట కలిగించిన ఎమ్మెల్సీకి లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నాచుపల్లి జేఎన్‌టీయూలో విద్యార్థుల ఫీల్డ్ విజిట్

**కొడిమ్యాల, సెప్టెంబర్ 30,(ప్రజాజ్యోతి):**
ఇంజినీరింగ్ విద్యపై అవగాహన పెంచుకునేందుకు పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ ధారూర్ విద్యార్థులు మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూహెచ్ కళాశాలను సందర్శించారు. స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్--డిఐసిఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఫీల్డ్ విజిట్‌లో విద్యార్థులు కళాశాలలోని వివిధ విభాగాల ల్యాబ్‌లను పరిశీలించారు. ఈఈఈ, ఈసీఈ, ఐటీ, సీఎస్ఈ, మెకానికల్ విభాగాల్లోని ప్రయోగశాలల్లో సాంకేతిక పరికరాలు, ప్రయోగ విధానాలను తెలుసుకున్నారు.




విద్యార్థులతో ప్రిన్సిపాల్ డా. జి. నరసింహ మాట్లాడి.. కొత్త విషయాలపై ఆసక్తి పెంచుకుని, సమస్యలకు వినూత్న పరిష్కారాలు కనుగొనేలా ఆలోచించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ఐడియా క్రియేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు గుడూరి శ్రీదేవి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక ...

**రాయికల్, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి)**
రాయికల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శుల సమావేశం బుధవారం నిర్వహించారు. సెప్టెంబర్ 30, 2026న మధ్యాహ్నం 3 గంటలకు జరిగిన ఈ సమావేశంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శులు సమావేశమై రాయికల్ మండల ప్రజా పరిషత్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాయికల్ మండల నూతన కార్యవర్గం అధ్యక్షులు: ఎస్. రాజారెడ్డి ప్రధాన కార్యదర్శి: డి. నరేష్, ట్రెజరర్: ఏ. రమ్య కృష్ణ, ఉపాధ్యక్షులు సిహెచ్ రాజశ్రీ, ఎం.డి. అమీర్ లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం మండల పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, పరస్పర సమన్వయం కోసం కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు.

PRAJA JYOTHI 01-10-2026_1 9/30/2026 11:29 PM Page 12



# సీఎం రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ నిరసన.. దిష్టిబొమ్మ దద్దం

**ఎండపల్లి, సెప్టెంబర్ 30, ప్రజా జ్యోతి**

హిందువులు దేవుళ్ళుగా భావించే శ్రీరాముడు, శివుడు లాంటి దేవుళ్ళపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బిజెపి రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు మండలంలోని రాజారాంపల్లి లో బీజేపీ నాయకులు బుధవారం నిరసన తెలిపారు రాజారాంపల్లి రాష్ట్ర రహదారిపై వివేకానంద కూడలి వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్గం చేశారు. రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమ్ము రాంబాబు మండల అధ్యక్షులు రావు హనుమంతరావు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందూ దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగుతోందని ఆరోపించారు. శ్రీరాముడు, శివుడి మధ్య విభజన రేఖలు సృష్టించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమ్ము రాంబాబు మండల అధ్యక్షులు రావు హనుమంతరావు ,మండల ప్రధాన కార్యదర్శులు మంచి కట్ల రవి పొన్నం నరేష్ మేడిపల్లి



రాజశేఖర్ మండల ఉపాధ్యక్షులు గోపనవేని గంగాచలం ఓబీసీ మోర్చా అధ్యక్షులు అమర గోండ దివాకర్ బీజేవైఎం జక్కుల సాగర్ ఎస్సీ మోర్చా దేవి సంతోష్ బీజేవైఎం ప్రధాన కార్యదర్శి మేడిపల్లి రాజు మండల సీనియర్ నాయకులు జిట్టవేణి రమేష్ ఏలేటి భాస్కర్ రెడ్డి బూత్ అధ్యక్షులు కుషనపల్లి నరేష్ కొదురుపాక అశోక్ మండల నాయకులు దాసరి మల్లేష్ యాదవ్ శ్రీనివాస్ పాల్గొన్నారు

## సహకార సంఘానికి బకాయిలు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి



**రాయికల్, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి)**

రాయికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి మున్సిపాలిటీ నుంచి బకాయి ఉన్న రూ.12 లక్షలకు పైగా నిధులను వీలైనంత త్వరగా చెల్లించాలని కోరుతూ సంఘ పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులైన పలువురు రైతులు మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సహకార సంఘానికి రావాల్సిన రూ.12 లక్షలకు పైగా బకాయిలను త్వరితగతిన చెల్లించి, సంఘ కార్యకలాపాలకు సహకరించాలని వారు కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మనోహర్ గౌడ్ స్పందిస్తూ, మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి, అందుబాటులో ఉన్న నిధుల లభ్యత మేరకు ప్రతినెలా కొంత మొత్తాన్ని చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయికల్ సహకార సంఘం అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, సంఘ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రవికుమార్, రైతులు పడిగెల రవీందర్‌రెడ్డి, కుర్మ మల్లారెడ్డి, కొయ్యడి మైపాల్, జిల్లాల సుధాకర్, బేతి సత్యం, ముత్యంరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ పీఏసీఎస్‌కు రూ.1.65 కోట్ల నికర లాభం

**సభ్యులకు 10 శాతం డివిడెండ్ చెల్లింపునకు సర్వసభ్య సమావేశం ఆమోదం**

**రాయికల్, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):**

రాయికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సర్వసభ్య సమావేశం బుధవారం సంఘ అధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ సీఈఓ ఎ. రవికుమార్ ఆదాయ-వ్యయ వివరాలను వెల్లడిస్తూ.. 2025--26 ఆర్థిక సంవత్సరంలో పీఏసీఎస్ రూ.1.65 కోట్ల నికర లాభం సాధించి 'ఎ' గ్రేడ్ సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా



లాభాల నుంచి రైతు సభ్యుల వాటాధనంపై 10 శాతం డివిడెండ్‌ను వారి ఖాతాల్లో జమ చేసేందుకు సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అలాగే రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యత్వ ప్రక్రియ పూర్తి చేసినందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.15 లక్షల గ్రాంట్ వచ్చిందని పేర్కొన్నారు. రుణాలు పొంది సహజ మరణం చెందిన ఏడుగురు రైతు కుటుంబాలకు దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేల చొప్పున మొత్తం రూ.70 వేల ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. రానున్న ఖరీఫ్ వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బేతి మోహన్‌రెడ్డి, ఏవో ముక్తేశ్వర్, సీఈఓ రవికుమార్, పాలకవర్గ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మొరపల్లి గ్రామ వికాసానికి ప్రణాళికల గుర్తింపు

**జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):**

మొరపల్లి గ్రామపంచాయతీలో 2027--2028 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గ్రామీణ వికాస పథకం పనుల గుర్తింపు కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. గ్రామ సమగ్ర అభివృద్ధి, ప్రజల అవసరాలే లక్ష్యంగా ఈ సభను నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామానికి సంబంధించిన సామాజిక పటాన్ని (మ్యాప్) రూపొందించి, రాబోయే కాలంలో చేపట్టాల్సిన మురుగుగాల్వలు, రహదారులు, తాగునీరు వంటి పనులను ప్రజలతో చర్చించి ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, క్షేత్ర సహాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు, గ్రామ సంఘ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఉర్దూ మీడియం పాఠశాల పరిస్థితి దయనీయం

మెట్ పల్లి,సెప్టెంబర్ 30(ప్రజా జ్యోతి)

మెట్‌పల్లి పట్టణంలో ఉర్దూ మీడియం విద్యార్థుల కోసం నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఉన్నత పాఠశాల భవనం ఏళ్లుగా అసంపూర్తిగా ఉండటంతో అధ్వానంగా మారింది. మైనార్టీ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ నిర్మాణం పెండింగ్‌లోనే ఉండిపోయింది. భవనం పూర్తికాకపోవడంతో పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారింది. ప్రస్తుతం ఈ అసంపూర్తి భవనాన్ని కార్ల పార్కింగ్‌కు వినియోగిస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మారుతున్నా ఉర్దూ మీడియం పాఠశాల నిర్మాణానికి శాశ్వత పరిష్కారం దొరకడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు ఎంత నిధులు ఖర్చు చేశారు? మిగిలిన పనులు ఎప్పుడు పూర్తి చేస్తారు? అధికారులు స్పందించి త్వరగా పాఠశాలను అందుబాటులోకి తేవాలని స్థానికులు పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

